www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024



29, 30న డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 29,30న కడపలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలు ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్య అతిథిగా అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎంపీ ఎ. ఎ.రహీమ్ హాజరవుతారన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కడప ఉక్కు, రాష్ట్ర విభజన హామీలు అమలే అజెండాగా తీసుకుని చర్చిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా విభజన హామీలలో ప్రధాన డిమాండ్ అయిన కడప ఉక్కును కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ కాలం గడుపుతూ వస్తుందని విమర్శించారు. సంవత్సరాలు గడుస్తున్నా కడప ఉక్కుకు పునాది రాయి పడలేదన్నారు. ముఖ్య మంత్రులు, వారు వేసిన పునాదిరాళ్లు మారుతున్నాయే తప్ప కడప ఉక్కు శంకుస్థాపన మాత్రం జరగలేదన్నారు. రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు.

పెట్రోల్ దాడికి గురైన విద్యార్థిని మృతి

నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజా సంఘాల ఆందోళన



మృతదేహం వద్ద విలపిస్తున్న బాలిక తల్లి



దస్తగిరమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - బద్వేలు

ప్రేమోన్మాది చేతిలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ (16) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. బద్వేల్ శివారు ప్రాంతంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ సమీపంలో విఘ్నేష్ అనే వ్యక్తి మాట్లాడాలని పిలిచి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. 80 శాతం కాలిన గాయాలతో ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కొన ఊపిరితో ఉన్న దస్తగిరమ్మ మృతువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడిచింది. బాలిక మరణ వార్త విన్న తల్లిదండ్రులు గుండెలు అవిసేలా విలపించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తన బిడ్డకు అప్పుడే నూరేళ్లు నిండాయా అని రోధించారు. 'నిందితుడ్ని మీరు చంపుతారా లేక నన్నే చంపమంటారా' మృతురాలి తల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చూసిన స్థానికులు ఇంతటి కడుపుకోత ఎవరికి కలగకూడదని అన్నారు.ఈ సంఘటనతో బద్వేల్ పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో విషాదఛాయలు అమ్ముకున్నాయి. అనేక ప్రజా సంఘాలతో పాటు సిఐటియు, సిపిఎం, ప్రజాప్రతినిధులు నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ఆందోళన చేపట్టారు. నిందితుడిని పట్టణంలోని మైదుకూరు రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్

కడప అర్బన్ : బద్వేలులో ఇంటర్ విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఐ.యన్.సుబ్బమ్మ, వీరణాలశివకుమార్, వీరపోగు.రవి, బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి ముడియం చిన్ని ఎద్దు రాహుల్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళల పై నిత్యం దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నా యన్నారు. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహి స్తున్నాయని తెలిపారు. దేశంలో బలమైన చట్టాలు లేకపోవడంతో అనునిత్యం మహిళలు, విద్యార్థినిలుపై అనేక రూపాలలో దాడులు పెట్రేగి పోతున్నాయని అన్నారు. .బద్వేలు లో జరిగిన సంఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందని అన్నారు. బాధితురాలు కుటుంబానికి రూ. 50 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ,ప్రేమోన్మాది విఘ్నేష్ నీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ రెబ్బ నరసింహులు జిల్లా సహాయ కార్యదర్శి ఆది తులసిశ్వర్ యాదవ్, శ్యామ్ పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి శ్రీనివాసులురెడ్డి, మనోహర్, లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో నిందితుడిని శిక్షించాలని పేర్కొన్నారు.

మరణశిక్ష విధించాలి

బద్వేలు : బాలిక మృతికి కారకుడైన విఘ్నేష్‌కు మరణ శిక్ష విధించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్తుడిని పట్టుకోవడంలో తీవ్రమైన కృషి చేసిన పోలీసు అధికారులను అభినందిస్తూ నిందితుడికి ఉరిశిక్ష విధించి, బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ నాయకులు ఎస్.కె మస్తాన్ షరీఫ్,కె.శివకుమార్, పి .మోక్షమ్మ, బాలమ్మ, ఖైరున్ బీ, ఫాతిమా, రాజగోపాల్,నరసింహ,రాయప్ప, శ్రీనివాసులు, హరి,యువరాజు పాల్గొన్నారు.

దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బాలికను అతి దారుణంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, దిశ చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా పేర్కొన్నారు. ఆదివారం వైసిపికి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, దిశ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవడమే ఈ సంఘటనకు ప్రధాన కారణమని చెప్పారు. విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా శిక్షించినప్పుడే ఎవరైనా తప్పు చేయా లంటే భయం కలుగు తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాక మల్ల రాజగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి

అట్లూరు : దస్తగిరమ్మపై పెట్రో దాడులు మళ్లీ పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇ. రమణ డిమాండ్ చేశారు. బాలికలు, మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా మరణ శిక్ష విధించాలని పేర్కొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

ఎపి నూర్‌బాష్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : బద్వేల్ వి ద్యార్థిని దస్తగిరమ్మపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఎపి నూర్ బాష్ ఎంప్లాయీస్ యూ నియన్ రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్ధయ్య, దూదే కుల సంఘం నాయకులు ఖాదర్‌బాషా, దూదేకుల పోరాట హక్కుల సంఘం నాయకులు మన్సూర్ అక్బర్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప సర్వజనాస్పత్రి ఆవరణంలోని మార్చురీ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమించలేదనే ఉద్దేశంతో ఇంతటి ఘాతుకానికి పాల్పడిన విధానం సభ్యసమాజాన్ని నివ్వెరపరుస్తోందన్నారు. ప్రేమోన్మాద ఘటన చోటుచేసుకున్న వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించిన విధానం బాగుందన్నారు. బాధిత కుటు ంబానికి రూ.కోటి నగదు, ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల పొలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం సైతం సత్వరమే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఏదేమైనా నాగరిక సమాజంలో ఇటువంటి ఘట నలు పునరావృతం గాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దస్తగిరమ్మ మృతదేహాన్ని పరిశీలించడానికి కడప, నంద్యాల జిల్లాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పెద్దఎత్తున సంఘీభావంగా తరలిరావడం గమనార్హం. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పగడాల ఆయిల్‌మిల్ ఓబు లేస్, దూదేకుల సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓ. రసూల్, ఆకు మళ్ల బాబు, రాయల్‌బాబు, ఖాదర్‌హుస్సేన్, బాదుల్లా, కుళ్లాయప్ప, నజీర్, సహా సుమారు 50 నుంచి 60 మంది దూదేకుల సంఘం నాయకులు హాజరయ్యారు.

బద్వేల్ ఘటనపై టిడిపిలో నిశ్శబ్దం!

- పరామర్శకూ వెళ్లని నాయకత్వం

- జిల్లా కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బద్వేల్ ప్రేమోన్మాది ఘటనపై టిడిపిలో నిశ్శబ్దం రాజ్య మేలుతోంది. ఇంతటి హేయమైన అమానుష ఘటన చోటుచేసుకున్న వెం టనే ప్రతిపక్ష వైసిపి జిల్లా అధ్యక్షులు, మేయర్, బద్వేల్ ఎమ్మెల్యే, సిఐటియు, డివైఎఫ్ఐ వంటి ప్రజాసంఘాలు మానవత్వంతో పరా మర్శించడం, ఖండించడం వంటి చర్యలతోపాటు, బాధిత కుటుం బానికి న్యాయం చేయాలని డిమాండ్ చేయడం తెలిసిందే. కానీ టిడిపి జిల్లా నాయకత్వం బద్వేల్ ఘటనపై కనీసం ఖండన చేయ డానికి ముందుకు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు పేర్కొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. దూదేకుల ఓట్లతో ఎన్నికల్లో గెలిచి అధికారం చలాయిస్తున్న జిల్లా నాయకత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోవడం విస్మయాన్ని కలిగి స్తోంది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమ ఇంటి చుట్టూ తిరి గారని, ఆపద సమయంలో ఆదుకోవడానికి, ఓదార్చడానికి సైతం మనసు రాలేదా అని బాధితురాలి కుమారుడు నిలదీయడం విస్మ యాన్ని కలిగించింది. టిడిపి రాష్ట్ర నాయకత్వం స్పందించి రాజకీ యంగా నష్ట నివారణ చర్యలు తీసుకున్నట్లు అర్థమవుతోందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి తరహాలో కూడా టిడిపి జిల్లా నాయకత్వంలో స్పందన లేకపోవడం విచారకరమని దూదేకుల సం ఘం నాయకులు, దూదేకుల సంఘాల నాయకత్వాలు విమర్శించడం గమనార్హం.

పెళ్లి చేసుకోవాలని అడిగినందుకే హత్య : ఎస్‌పి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా బద్వేల్ సమీపంలో హత్యకు గురైన బాలిక కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రొద్దుటూరు దస్తగిరమ్మ అనే బాలికను దహనం చేసిన దారుణ ఘటనపై పోలీసులు తక్షణం చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 12 గంటలకు బద్వేల్ పట్టణం రామాంజనేయనగర్‌కు చెందిన జక్కల విఘ్నేష్‌ను పట్టణ శివార్లలోని డిటిసి సమీపంలో బద్వేల్ రూరల్ సిఐ తన సిబ్బందితో కలసి అరెస్టు చేశారని పేర్కొన్నారు. విచారణ సమయంలో మృతురాలు తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతుండేదని చెప్పాడన్నారు. ఆమె నుంచి వస్తున్న ఒత్తిడిని తప్పించుకోవడానికి ముందస్తు ప్రణాళికతో పి.పి.కుంటకు రావాలని కోరినట్లు వెల్లడించాడని పేర్కొన్నారు. ఆమెను కలిసేందుకు కడప నుంచి బద్వేల్‌కు బైక్‌పై వస్తూ దారిలో ఆలంఖాన్ పల్లి సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో తన బైక్‌లో పెట్రోల్ పట్టుకున్నాడని చెప్పారు. బైక్ ట్యాంక్ పైపు నుంచి ఒక బాటిల్‌లోకి పెట్రోల్ పట్టుకుని బ్యాగ్‌లో ఉంచుకున్నాడని తెలిపారు. ఇద్దరు కలిసి పిపి కుంట సమీపంలోని అడవిలోకి వెళ్లారన్నారు. అక్కడ ఇద్దరూ శారీరకంగా కలుకున్న తరువాత ఆమె వివాహం గురించి అతడిని ఒత్తిడి చేయడంతోపాటు వారి మధ్య వాగ్వాదం చేటుచేసుకుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల సమయంలో ఆమెగొంతు నొక్కి కిందకు నెట్టాడని, దీంతో స్పృహ కోల్పోయిందని చెప్పారు. నిందితుడు తాను తెచ్చుకున్న బాటిల్‌లోని పెట్రోల్ ఆమెపై పోసి నిప్పంటించి మంటలు రేగిన తరువాత ఘటనా స్థలం నుంచి రోడ్డుపైకి వచ్చి ఆటోలో పరారయ్యాడని తెలిపారు. నేరం జరిగిన ప్రదేశంలో నిందితుడు మృతురాలి బట్టలు, తరగతి పుస్తకాలు, బ్యాగు, సగం కాలిన ఒక ఖాళీ పెట్రోల్ బాటిల్, కాలిన బట్టల బూడిద, నిందితుడు తాగిపడేసిన సిగరెట్ పీక, నేరం జరిగిన ప్రదేశంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నామని తెలిపారు.

సత్వర న్యాయం కోసం ప్రత్యేక కోర్టు

క్రూరమైన నేరాల బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా, ఈ కేసు లైంగిక వేధింపుల కేసుల్లో త్వరితగిన విచారణ కోసం ఇటీవల ప్రకటించిన ప్రత్యేక కోర్టుకు సిఫార్సు చేయబడుతుందని పేర్కొన్నారు. నిందితుడికి త్వరితగతిన శిక్ష పడేలా సాక్ష్యాధారాలను సేకరించేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేయడానికి కృషి చేసిన కడప పోలీసుల సత్వర, సమర్థవంతమైన చర్యకు డిజిపి అభినందించారు.

మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు? : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం కడప నుండి ఎర్రగుంట్ల బస్సులో ఆమె తోటి మహిళా ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేసిన తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలైనా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నారు అని ప్రశ్నించారు. తెలంగాణలో వారంలో అమలు చేశారు, కర్ణాటకలో కూడా అమలు చేస్తున్నారు, కానీ మీకు మాత్రం పథకం అమలు చేయడానికి ఇబ్బందులు ఏమిటి ? అని చంద్రబాబునాయుని ఈ సందర్భంగా విజయ జ్యోతి ప్రశ్నించారు. చిత బస్సు ప్రయాణంతో మహిళలకు భద్రత ఉంటుందని ఇది చాలా మంచి పథకమని పేర్కొన్నారు. . వెంటనే ఉచిత ప్రయాణం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మహిళా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు శ్యామలమ్మ, పిసిసి మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, పీస్ సంస్థల అధిపతి గౌస్ పీర్, హరి ప్రసాద్, సిరాజుద్దీన్, గంగయ్య మహిళలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమైన కూడళ్లలో అమరవీరులను స్మరిస్తూ హోర్డింగ్స్, బ్యానర్లు, ప్లెక్సీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సినిమా హాల్లో, లోకల్ టీవీ చానళ్లు, దినపత్రికల్లో ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. స్కూల్స్, కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాల కట్టడిలో యువత పాత్ర, పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై

అలుపెరుగని పోరాటం

- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ మన బాధ్యత
- స్వర్ణోత్సవ జిల్లా మహాసభల్లో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్
- నగరంలో అట్టహాసంగా మహాసభ ర్యాలీ
- ఎస్‌టిఎఫ్ఐ, యుటిఎఫ్ జెండాల ఆవిష్కరణ



కడప నగరంలో ర్యాలీనిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు



మహా సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అలుపెరుగని పోరా టం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెఎసి సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల సందర్భంగా నగరంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమై సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల మీదుగా యుటిఎఫ్ భవన్ వరకు నిర్వహించారు. ర్యాలీలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డ్రమ్స్ వాయిద్యాల మధ్య ఉపాధ్యాయులు నృత్యం చేస్తూ ర్యాలీని కొనసాగించారు. అనంతరం యుటిఎఫ్ భవన్ ఎదుట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఎస్‌టిఎఫ్ఐ జెండాను ఆవిష్కరించగా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. మహాసభ ప్రారంభానికి ముందు ఉపాధ్యాయులు గీతాలు ఆలపించారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మరి కొంతమందికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహా సభనుద్దేశించి కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామని తెలిపారు. అందరికి సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో సోషలిస్టు సమాజం కోసం యుటిఎఫ్‌ను మనపెద్దలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎన్నో లక్ష్యాలు, ఆశయాలు, డిమాండ్స్ సాధించుకున్నామన్నారు. హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎంతో పోరాటం చేశామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం పోరాడింది యుటిఎఫ్ మాత్రమే అన్నారు. ఉపాధ్యాయులకు, విద్యారంగానికి ఉపయోగపడే ఏ శిక్షణనైనా యుటిఎఫ్ స్వాగతిస్తుందని తెలిపారు. అనవసర యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. బోధన సమయంలో యాప్‌లను పట్టించుకోవద్దన్నారు. సమాజ శ్రేయస్సు కోరుకునేవారిగా ప్రభుత్వ బడులను కాపాడుకుందామని తెలిపారు. ఏ పాఠశాలను మూసివేయవద్దని యుటిఎఫ్‌గా చెబుతున్నామన్నారు. పని సర్దుబాటు లోపభుయిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, రూ.3.50 కోట్లు మాత్రమే తీర్చారని చెప్పారు. పిఆర్‌సి కమిషన్ వేయాలని, అప్పటి లోపు ఐఆర్ సాధించుకోవాలన్నారు.



సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ యు టిఎఫ్ జిల్లాలోని అన్ని మండాల్లో ఉండడం హర్షణీయమని పేర్కొ న్నారు. పిఆర్‌సి ఉద్యమంలో యుటి ఎఫ్ ముందు భాగాన ఉందని చెప్పారు. ఉపాధ్యాయుల పోరాట స్ఫూర్తితో సిఐటియు ముందుకు వెళు తుందన్నారు. 42 రోజుల పాటు అంగన్‌వాడీలు దీక్షలు చేసి గత ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని పేర్కొన్నారు. యుటిఎఫ్ పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.



యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి. లక్ష్మిరాజ, నవకోటేశ్వరరావు మాట్లా డుతూ 1974, ఆగస్టు 10న యుటిఎఫ్ స్థాపించబడిందని చెప్పారు. అప్పటి నుంచి విద్యా రంగ పరి రక్షణ, ఉపాధ్యాయ సమ స్యలపై పోరాడుతుందన్నారు. ప్రభు త్వాలకు తాబేదారులుగా యుటిఎఫ్ ఎప్పుడు పని చేయ లేదని పేర్కొన్నారు. 117 జివొ పై ఏ సంఘం నోరుమెదపకపోతే యుటిఎఫ్ ఆందోళన చేసిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే పేద విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. ఉపాధ్యాయులు, నాయకుల కృషితో యుటి ఎఫ్ భవనం నిర్మించుకున్నామన్నారు. యుటిఎఫ్‌కు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతులు తెలిపారు.



డిప్యూటీ డిఇఒ రాజగోపల్‌రెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ సేవలు అభినందనీయమని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.



యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి, పరిరక్షణకు రాష్ట్ర మహాసభల్లో ప్రణాళికలు రూపొందించుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్యారంగం అస్తవ్యస్థమై పోయిందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, టిఎలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ మొనగాడి సంఘంగా ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. సికె దిన్నె ఎండిఒ-2 రమావేది, కడప ఎండిఒ గంగిరెడ్డి ప్రసంగించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు రవి, శివకుమార్, జెవివి జిల్లా అధ్యక్షులు షామిర్‌బాష, గౌరవాధ్యక్షులు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవికుమార్, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టుల దాడిలో జవాన్ మృతి

స్వగ్రామానికి చేరిన మృతదేహం - పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు



రాజేష్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

చత్తీస్‌గడ్‌లోని అబూజ్ మడ్ ప్రాంతంలో మావోయిస్టుల మైనింగ్‌బాంబు వైఎస్‌ఆర్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం, పెలి తోట్లపల్లి పంచాయతీలోని పాపిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేష్ (37) మృతి చెందారు. చత్తీస్‌గడ్‌లోని ఐటిబిపి (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్)లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ దళానికి చెందిన మరో ఇద్దరు జవాన్ కూడా దాడిలో మరణించారు. మరో ఇద్దరికి గాయలయినట్లు సమాచారం. ఐటిబిపి, బిఎస్ఎఫ్ దళాలు దుర్బెద ప్రాంతంలో సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ నిర్వహించి శనివారం మధ్యాహ్నం నారాయణపూర్ కు తిరిగి వస్తుండగా కొడ్లియార్ గ్రామం వద్ద ఐఇడి పేలుడు సంభవించి పాపిరెడ్డి పల్లె గ్రామ జవాన్ కొడవటికంటి రాజేష్ మృతి చెందారు. రెండు నెలల కిందటే మృతుడు తన స్వగ్రామంలో అందరితో కలిసి సంతోషంగా గడిపారు. సెలవులు ముగించుకుని తిరిగి విధుల్లో చేరారు. ఇంతలోనే ఈ ఘటనతో రాజేష్ మృతి చెందారు.

కొడవటి గంటి బాలమ్మ, జానయ్య దంపతులకు రాజేష్ పాపిరెడ్డిపల్లెలో 1988లో జన్మించారు. బద్వేల్ ఆర్‌సిఎం పాఠశాలలో 10వ తరగతి చదివారు. ఇంటర్ బ్రహ్మంగారిమఠంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్తిచేశారు. ఇంటర్‌లోనే ఐటిబిపిలో ఉద్యోగం సాధించారు. అదే మండలం పలుగు రాళ్లపల్లిలోని తన అక్క కూతురు స్వాతిని వివాహం చేసుకున్నారు. మృతుడికి రిసెన్స్, రిషిక, రియాన్స్ అనే ముగ్గురు పిల్లలున్నారు. మరణ వార్త వినగానే కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా రాజేష్ 2007వ సంవత్సరం నుంచి జవాన్‌గా పని చేస్తున్నారు. భార్య సొంత గ్రామం పాపిరెడ్డి పల్లె లోనే ఉంటూ తమ పిల్లలను చదివించుకుంటూ ఉంటుంది.

స్వగ్రామం చేరిన మృతదేహం..

జవాన్ రాజేష్ మృతదేహం చత్తీస్‌గడ్ నుంచి ఆదివారం రాత్రి బి.మఠం మండలం పాపిరెడ్డిపల్లెకు చేరుకుంది. మృతదేహం రాగానే గ్రామానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో మృతునికి ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తారు. జవాన్‌కు నివాళులర్పించేందుకు కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరు కానున్నారు.

పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు.. రాజేష్ మృతితో పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబం శోకసంద్రంలో మునిగి తేలింది. తోడుగా ఉంటాడనుకున్న భర్త మావోయిస్టుల దాడిలో మృతిచెందడంతో భార్య గుండెలు అవిసేలా విలపించింది. తండ్రి మరణంతో ముగ్గురు చిన్నారులు బోరున విలపించారు. వారి బాధను చూసి చుట్టుపక్కల వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

విత్తన నాణ్యతకు పెద్దపీట

25 శాతం సబ్సిడీతో పంపిణీ

ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ కె.జగదీష్ వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నాణ్యమైన విత్తన సరఫరా చేయడానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రతిఏటా ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, బుడ్డశనగ, పచ్చిరొట్ట విత్తనాలు వంటి పలు పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాన్ని సేకరించడం తెలిసిందే. ఇందులోభాగంగా ఈ ఏడాది ఒంగోలు జిల్లా నుంచి నాణ్యమైన విత్త నాన్ని సేకరించే ఆలోచనల్లో ఉన్నాం. వేరుశనగ విత్తన సేకరణ, పంపిణీ వ్యవహారాల్ని నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు ఇవ్వడమైంది. ప్రస్తుతం బుడ్డశనగ విత్తనాన్ని 25 శాతం సబ్సిడీతో ఆర్‌ఎస్‌కెల ద్వారా రైతాంగానికి పంపిణీ చేస్తున్నాం. ఎపి సీడ్స్ మార్కెట్లో ఉన్న కారణంగా బయటి మార్కెట్లో ధరలు స్థిరంగా కొనసాగుతాయని, లేని పక్షంలో ధరలు అమాంతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఏతా వాతా తేలిదేమిటంటే ఎపి సీడ్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లో ధరల స్థిరీకరణ కొనసాగుతుందని ఘంటాపథంగా చెప్పవ చ్చునడంలో సందేహం లేదు.

ప్రొక్యూర్‌మెంట్ విధానం గురించి చెప్పండి?

ఎపి సీడ్స్ విత్తన సేకరణకు సంబంధించి టెండర్లు పిలు స్తాం. ఇందులో అర్హత కలిగిన కంపెనీని ఎపి సీడ్స్ రాష్ట్ర ఉన్నతాధి కారులు ఎంపిక చేయడం జరుగుతుంది. ప్రస్తుత ఏడాది వరద అగ్రి టెక్, విఘ్నేశ్వర, కలిమి సీడ్స్, బాలాజీ, సుబ్రమణ్యేశ్వర, వెంకటే శ్వర, కలిమి అగ్రోటెక్, కర్మీ సీడ్స్ ఏజెన్సీలు పాల్గొనడం జరిగింది. వీటి పరిధిలోని రెండు, మూడు విడతల్లో ల్యాబ్ టెస్టింగ్ అనంతరం నాణ్యతను నిర్ధారించడం జరుగుతుంది.

విత్తన నాణ్యతను ఎలా నిర్ధారణ చేస్తారు?

విత్తన నాణ్యతకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు విజయవాడ, కడప, కర్నూలు ల్యాబ్స్‌కు విత్తన పంపిణీ నాణ్యతను పరిశీలిస్తారు. టెస్టింగ్, స్క్రీనింగ్, ఆస్పెక్టెడ్ వంటి సదుపాయాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయడం జరుగుతుంది.

విత్తన సరఫరా గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఆర్‌ఎస్‌కె టెండరు దక్కించుకున్న ఏజెన్సీలు తమ వాహనాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుంది. ఇందులో కడప జిల్లాలో 280 ఆర్‌ఎస్‌కె, అన్న మయ్య జిల్లాలో 390 ఆర్‌ఎస్‌కె సరఫరా చేయడం పరిపాటిగా మా రింది. కడప జిల్లాలోని 280 ఆర్‌ఎస్‌కెలకు 72 వేల క్వింటాళ్ల మేర రూ.14 కోట్ల విలువైన బుడ్డశనగ విత్తనాన్ని పొజిషన్ చేశాం.

సబ్సిడీ తగ్గుదలకు కారణమేమిటి?

విత్తన సబ్సిడీ హెచ్చుతగ్గులు ప్రభుత్వ పరిధిలోని అంశం. ఈ ఏడాది 40 శాతం సబ్సిడీతో వేరుశనగ, 50 శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనం, 25 శాతం సబ్సిడీతో బుడ్డశనగ విత్తన సబ్సిడీలతో అందజేస్తున్నాం.

మార్కెట్ల పోటీ గురించి వివరించండి?

బహిరంగ మార్కెట్ల నుంచి పోటీని ఎదురవుతోంది. అన్న మయ్య జిల్లాలోని రాయచోటిలో ప్రొద్దుతిరుగుడు విత్తనానికి నే షనల్ సీడ్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లిపోయింది. ఎపి సీడ్స్ తగ్గిస్తే ప్రయివేటు వ్యాపారులు కూడా తగ్గించే అవకాశాలను స్పష్టంగా గమనించాం. దీనిపై రాష్ట్ర ఉన్నతాధి కారులను సంప్రదించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటువంటి పోటీ వాతావరణం కారణంగా రైతులకు మోస్తరుగా లబ్ధి చేకూరుతోందని చెప్పవచ్చు. ఒకరకంగా ధరల స్థిరీకరణకు ఎపి సీడ్స్ కారణమవుతో ందని చెప్పవచ్చు.

ఎపి సీడ్స్ వ్యాపార సరళి ఎలా నడుస్తోంది?

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.16 కోట్ల వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.60 కోట్ల, 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మ డి జిల్లాలో రూ.50 కోట్ల వ్యాపారంతో పోలిస్తే గణనీయంగా తగ్గి పోవడం ఆందోళన కలిగిస్తోంది.



సిబ్బందికి సూచనలిస్తున్న డిఎస్‌పి మురళీ నాయక్

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

- డిఎస్‌పి మురళీ నాయక్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ హెచ్చరించారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లారుజామున నాకాబందీ నిర్వహించారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో నలుగురు సిఐలు, ఐదుగురు ఎస్ఐలు, 150 మంది సిబ్బంది నగరిగుట్టలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో 20 ద్విచక్ర వాహనాలు, సరైన పత్రాలు లేని నాలుగు ఆటోలు, 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఒక మట్కా బీటర్‌ను కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంచి దారిలో వెళ్లి పని చేసుకుని జీవనం కొనసాగించాలని డిఎస్‌పి సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం విద్యుత్ శాఖలో అధునాతన (స్మార్ట్) మీటర్లు ఏర్పాటు చేసి కొత్త ఫీచర్ల తో సరఫరాను అంది స్తున్నట్లు ఆ శాఖ ఎఇ దినేష్ కుమార్ తెలిపారు. సింహాద్రిపురం ప్రభుత్వ కార్యాల యాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ మండల పరిధిలో మొదటి విడతలో ప్రభుత్వ, కేటగిరి-2కు సంబంధించి 940 కనెక్షన్లు ఉన్నాయన్నారు. వీట న్నిటికీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో విద్యుత్ వినియోగంలో స్మార్ట్ మొబైల్స్ వాడుక పెరగనుందన్నారు. తమ సెల్‌లోనే యాప్ ద్వారా తమ విద్యుత్ సర్వీసుకు ఎంత మొత్తం రీఛార్జ్ చేయాలనుకుంటే అంత మొత్తానికి చేసుకోవచ్చన్నారు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ అనుసంధానంతో మరిన్ని ప్రయోజనాలు వినియోగదారుడికి లభించనున్నాయన్నారు.



గ్రంథాలయాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెంచి అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీ రుద్దీన్ సూచించారు. చాపాడు శాఖా గ్రంథాలయాన్ని ఆది వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాల యంలోని రికార్డులను పరి శీలించారు. గ్రంథా లయానికి వచ్చే దిన, వార, మాస, పత్రికలను పరిశీలించారు. గ్రం థాలయానికి రావాల్సిన పన్ను బకాయిలు సకాలంలో వచ్చేలా చూడాలని తెలి పారు. గ్రం థాలయ అభివృద్ధి, పాఠకుల సంఖ్య పెంచడం, సభ్యత్వ నమోదు వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా నిర్వ హణ ఉండాలన్నారు. గ్రంథాలయ అధికారి జె శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సయ్యద్ అమీరుద్దీన్

నోటీస్ బోర్డులో పలువురి ఫోటోలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల పరి ధిలో పలు వరుస నేరాలకు పాల్ప డుతున్న నిందితుల ఫొటోలను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరుసగా నేరాలకు పాల్పడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారిన వారిని గుర్తించి వారి ఫొటోలను పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో ఉంచామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏవైనా సైబర్ సమస్యలు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు.



నోటీస్ బోర్డులో ఫొటోలను ఏర్పాటు చేసిన ఎస్ఐ

అదుపుతప్పి కూలీల లారీ బోల్తా

-తప్పిన పెను ప్రమాదం.. కూలీలు సురక్షితం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం అరటి కాయల లారీ బోల్తా పడింది. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు విశ్వనాథరెడ్డికి అరటికాయలు కోసేందుకు కూలీలతో తోట వద్దకు లారీ వెళుతుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమా దంలో ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో కూలీలందరూ ఊపిరి పీల్చుకు న్నారు. ప్రమాదానికి రోడ్డు గుంతలమయం కావడమే కారణమని కూలీలు తెలిపారు.

క్రైం కార్నర్

పాత గొడవలతో ఘర్షణ

ప్రజాశక్తి - ముద్దనూరు

పాత గొడవలు మనసులో పెట్టుకుని రెండు కుటుంబాల వారు ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు సిఐ దస్తగిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోంపల్లె గ్రామానికి చెందిన మూలె నాగమునిరెడ్డి, ఎర్రం రామకృష్ణారెడ్డి మధ్య భూ వివాదానికి సంబంధించి గతంలో గొడవలున్నాయి. వీటిని మనసులో పెట్టుకుని ఆదివారం ఆ రెండు కుటుంబాల వారు ఘర్షణకు దిగారు. గాయపడినవారిని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)


మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగరం వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై తోపుడు బండిని తోసుకుపోతున్న అయ్యవారప్పను బొలెరో పికప్ వాహనం ఆదివారం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయనకు రెండు కాళ్లు విరిగినట్లు స్థానికులు గుర్తించారు. తోపుడు బండి పూర్తిగా దెబ్బతింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన అయ్యవారప్పను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పడిపోయిన రియల్ ఎస్టేట్ ధరలు

భారీగా తగ్గిన క్రయవిక్రయాలు - ప్రభుత్వం మారడమే కారణం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా పడిపోయింది. ఇందుకు ప్రభుత్వం మారడం ఒక కారణంకాగా.. భారీగా ధరలు పెంచడం మరో కారణం. ప్రస్తుతం స్థలాలు, ఇళ్ల క్రయవిక్రయాలు మూడు నెలలుగా మందగించాయి. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో పులివెందుల అభివృద్ధి జరుగుతుందని అయిదేళ్ల నుంచి కొందరు వ్యాపారులు, ఉద్యోగులు, పట్టణం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు పట్టణంలో స్థలాలు కొనుగోలుకు ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో ధరలు విపరీతంగా పెరిగాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం పడిపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా భారీగా దెబ్బతింది. వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత పులివెందుల అభివృద్ధి జరుగుతుందని, పలు పరిశ్రమలు వస్తాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ప్రచారం చేసి తమ వెంచర్లను అమ్ముకున్నారు. చాలామంది మరింత ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో అప్పులు చేసి కొన్నారు. అంతేకాకుండా మరికొందరు పులివెందుల జిల్లా అవుతుందని ప్రచారం చేయడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత పుంజుకుంది. రోజురోజుకూ ధరలు పెంచుతూ వ్యాపారం చేసుకుంటూ భారీగా లాభాలు గడించారు. అయితే ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో అప్పులు చేసి కొన్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం అప్పులు తీర్చడానికి కొన్న స్థలాలను



అమ్ముకోవాలంటే కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. కొన్న దానికన్నా తక్కువ ధరకే అమ్ముతామన్న కూడా ముందుకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుదోచని స్థితిలో ఉన్నారు. మరికొన్ని రోజులు పరిస్థితి ఇలానే ఉంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఐపీ పెట్టే పరిస్థితి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. దళారుల మాటలు విని రియల్ ఎస్టేట్‌పై పెట్టుబడి పెట్టిన వారు ఏం చేయాలో అర్థంకాకా అయోమయ స్థితిలో ఉన్నారని చెప్పవచ్చు.



భూమిపూజ కార్యక్రమంలో టిడిపి నేతలు

పల్లెపండుగతో గ్రామ స్వరాజ్యం సాధ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

పల్లెపండుగతో గ్రామ స్వరాజ్యం సాధ్యమని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఇడుపులపాయ గ్రామంలో సిమెంటు రోడ్డుకు రఘునాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పిపి చెంద్రాయుడు, వేమా కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, పోతిరెడ్డి గోపినాథ్, శివకృష్ణారెడ్డి, రెడ్డి కిషోర్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఎఇ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఎపిఒ పార్వతి, సచివాలయ సిబ్బంది, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో 'ఉపాధి' సమాచారం

అందుబాటులో జన్‌మన్ రేగా యాప్ - కూలీలకు ఉపయోగకరం



ప్రజాశక్తి - సింహాద్రిపురం

జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి చట్టంలో పనిచేస్తున్న కూలీల సమగ్ర సమాచారం తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ రేగా యాప్ అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారాన్ని తెలుసుకోచ్చు. అంతేకాక ఫిర్యాదులు సైతం అందులో తెలియజేసే అవకాశం ఉంది. కూలీలు ఇప్పటి వరకు ఏ సమాచారం కావాలన్నా ఉపాధి ఎపిఒ, పోస్ట్ ఆఫీస్, ఉపాధి సిబ్బంది చుట్టూ ప్రదర్శనలు చేయాల్సి వచ్చేది.

అందుబాటులోకి జన్‌మన్ రేగా యాప్..

కేంద్ర ప్రభుత్వం సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి జన్‌మన్ రేగా (జెఎఎన్ఎంఎఎస్ఆర్ఈజిఎ) యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే ఓపెన్ అవుతుంది. అనంతరం రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామపంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే పూర్తి వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, కూలి మొత్తం డబ్బులు, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయింది, ఎంత మొత్తం జమ అయింది వివరాలు కనిపిస్తాయి. కూలి డబ్బులు జమ కానట్లయితే అందుకుగల కారణాలు సైతం అందులో పొందుపరిచి ఉంటాయి. దీంతోపాటు ఉపాధిలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం తెలుసుకోవచ్చు. మండల వ్యాప్తంగా 6,250 జాబ్ కార్డులు ఉండగా, అందులో 4,580 మంది ఉపాధి పనులకు వెళుతున్నారు. వీరిలో చాలా మంది పనులకు వెళుతున్నప్పటికీ వేతనాల కోసం పోస్ట్‌ఆఫీస్, ప్రయివేట్ ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం (ఎఇపిఎస్) చుట్టూ తిరుగుతున్నారు. ఇకపై ఇలాంటి కష్టాలు లేకుండా నేరుగా తమ సమగ్ర సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు..

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. నిబంధనలకు విరుద్ధంగా కూలీలతో కాకుండా యంత్రాలతో పనులు చేసినా, కొంతమంది క్షేత్రస్థాయిలోని ఉపాధి సిబ్బంది పనులకు వెళ్లకుండా ఉన్న కూలీలకు పనులకు వెళ్లినట్లు బిల్లులు పెట్టినా ఇందులో ఫిర్యాదు చెయొచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లో అందుబాటులో ఉన్నాయి. ఉపాధి పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

యాప్ ఎంతో ఉపయోగకరం..

గతంలో ఉపాధి పనులకు వెళ్లినప్పటికీ డబ్బుల కోసం పోస్ట్ ఆఫీస్, ప్రయివేటు ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం(ఎఇపిఎస్)చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ యాప్ అందుబాటులోకి రావడం వల్ల వేతన వివరాలు, ఇతర సమగ్ర సమాచారాన్ని నేరుగా తెలుసుకునే అవకాశం ఉంది.

- వెంకటరాముడు, ఉపాధి కూలీ, సింహాద్రిపురం

పారదర్శకత కోసం అందుబాటులోకి..

ఉపాధి హామీ చట్టం పూర్తిస్థాయిలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పిస్తున్నాం.

- కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపురం



కమిషనర్‌ను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

కమిషనర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను గాంధీ పార్కులో ఆదివారం సద్భావన సేవా సమితి, మన ప్రజా సేవా సమితి సంయుక్తంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో మురుగు కాలువలో చెత్త, ఇతర ప్యాకెట్లను వేయడం వల్ల మురుగు పోలేక నిలుస్తోందన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. సాయంత్రం వేళ మున్సిపల్ బండి వస్తుందని పట్టణ ప్రజలు చెత్తను అందులో వేయాలని కోరారు. స్థానికంగా కుక్కల బెడద నివారణకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మున్సిపాలిటీ సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మన ప్రజా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్, సద్భావన సేవాసమితి గౌరవ అధ్యక్షులు పుల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లా బకాష్, ఉపాధ్యక్షులు లక్ష్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, కింగ్ బాషా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జిల్లా అవోపా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - చక్రాయపేట

కడప జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ప్రమాణస్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమాన్ని గండిక్షేత్రంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించారు. జిల్లా అవోపా అధ్యక్షులుగా గూడూరు హరికృష్ణచే రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతోపాటు జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఉప కార్యదర్శులు, కోశాధికారులు, ఇసి సభ్యులు, తదితర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వళనతో ప్రార్థన గేయంతో పులివెందుల అవోపా అధ్యక్షులు మేడం దినేష్ అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షులు రాయవరం శివరావు, అధ్యక్షులు పచ్చిపులుసు మురళీకిషోర్, వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, వేంపల్లె అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర రీజినల్ ఉపాధ్యక్షుడు అంబికేశ్వర శెట్టి, వేంపల్లె అవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి గోనుగుంట్ల సంధ్యారాణి, కడప జిల్లాలోని అవోపా యూనిట్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




హరికృష్ణను సన్మానిస్తున్న వేంపల్లె అవోపా కార్యవర్గ సభ్యులు

ట్యాంకుల శుభ్రత.. అధికారులకు పట్టదా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి గ్రామానికి సురక్షిత జలాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆయా గ్రామాలలో ప్రజల అవసరాలను బట్టి మంచి నీటి ట్యాంక్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. రెండు వారాలకొసారి ట్యాంకులను క్లోరినేషన్ చేయాల్సి ఉంది. ఎక్కడా అలాంటి చర్యలు చేపట్టలేదు. తాగునీరు కలుషితం అవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ లోపల పాచి పేరుకొని ఉండడంతో నీరు దుర్వాసన వేస్తోందని ఆవేదన చెందుతున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురి కావాల్సిన వస్తోందని పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలుండగా.. ఒక్కో పంచాయతీలో నాలుగు లేదా ఐదు ట్యాంక్‌లున్నాయి. ట్యాంక్‌ల శుభ్రత సమయంలో క్లోరినేషన్ తేది సూచించాల్సి ఉంది.. ఎక్కడా ఆ చర్యలు చేపట్టలేదు. సచివాలయం పరిధిలో



ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నా ట్యాంక్‌ల శుభ్రత, క్లోరినేషన్ గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో నీరు రంగు మారడంతోపాటు ట్యాంక్‌ల శుభ్రత లోపించడం వల్ల జబ్బులకు గురి కావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆయా పంచాయతీల్లో కార్యదర్శులు ఉన్నా పారిశుధ్యం, ట్యాంకుల శుభ్రతపై ఎలాంటి దృష్టి సారించడం లేదని ప్రజల ఆరోపి స్తున్నారు. పంచాయతీలపై ఉన్నతా ధికారుల పర్య వేక్షణ ఏమాత్రం లేదని, సిబ్బంది కార్యాలయానికి పరిమితం అవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులకు స్పందించి గ్రామా లలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని, ట్యాంకుల శుభ్రతపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రయోగాలు చేస్తున్న సివి రామన్ సైన్స్ క్లబ్ సభ్యులు

సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

సర్ సివిరామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కాలేజీలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఫిజిక్స్‌లో కాంతి పరావర్తనం, వక్రీభవనానికి సంబంధించి ప్రయోగాలను చేసి చూపించారు. బయాలజీకి సంబంధించి ఏకదళ బీజ, ద్విదళ బీజ, కాండం వేరు, ఆకు అడ్డుకోతలు, జీర్ణవ్యవస్థ గురించి వివరించారు. ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులు 40 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు గోపీనాథ్‌రెడ్డి, నరసింహులు, తిరుమల కొండు, సుబ్బనాయుడు, విజయ మోహనరెడ్డి, క్లబ్ కార్యదర్శి అల్లా బకష్ పాల్గొనారు.

సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

ప్రజాశక్తి - చాపాడు

దేశంలో అత్యధికంగా పెరుగుతున్న బాల్య వివాహాలపైన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలంమెంట్ సొసైటీ అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్య యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లెటర్ అండ్ స్పిరిట్‌తో బాల్య వివాహాల చట్టాన్ని అమలు చేయడం లేదని, బాల్య వివాహ రహిత భారత దేశం క్యాంపెయిన్ సభ్యులుగా ఉన్న సామాజిక కార్యకర్త నిర్మల్ గోరానా దాఖలు ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించిందని తెలిపారు. బాల్య వివాహం పిల్లల హక్కులను దోచుకోవడమే కాక, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే మైనర్ల స్వేచ్ఛ సంకల్పాన్ని ఉల్లంఘించడమేనని తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలను అరికట్టడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయడం కోసం సుప్రీం కోర్టు మార్గదర్శకాలను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ వారు దేశవ్యాప్తంగా చేపట్టిన బాల్య వివాహాల రహిత భారతదేశం ఉద్యమంలో తమ సంస్థ భాగస్వామ్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

- మున్సిపల్ కమిషనర్ రాముడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆధార్ కార్డులు ఇంకా చాలా వరకు బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్ ఉన్నందున ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ప్రత్యేక కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు పులివెందుల పురపాలక సంఘ పరిధిలో నిర్దేశించిన సచివాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న వెంకటాపురం, జిల్లా పరిషత్ హైస్కూల్ నగరిగుట్టలో, 23న ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల అహోబిళపురం, రమణప్ప సత్రం పాఠశాల మెయిన్ రోడలో, 24న ఎంజెపిఎపివిసి డబ్ల్యూ ఆర్ఎస్ పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ (వైఎస్‌వి‌ఆర్ఎం)లో, 25న అంగన్వాడీ కేంద్రం ఎస్‌బిఐ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆధార్ నమోదు కేంద్రాలు ఉంటాయన్నారు. ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర పరిస్థితి అధ్వానం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొన్నారు. డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వంగా తయారైందని విమర్శించారు. జూన్, జులైలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు డయేరియా రోగులతో కిటకిటలాడాయన్నారు. జగ్గయ్యపేట, సామర్లకోట, పిడుగురాళ్ల, ఖాజీపేట తదితర ప్రాంతాల్లో అనేక మంది ఆస్పత్రుల పాలయ్యారని, ఆరు మంది చనిపోయినట్లు వివరించారు. ఆగష్టులో డెంగీ, మలేరియా, చికెన్‌గన్యా వ్యాధులు విజృంభించాయన్నారు. మలేరియా కేసులు 2022లో 1,237, 2023లో 3,840 నమోదు కాగా 2024 ఆగష్టు 25 వరకు 4,610 కేసులు నమోదైనట్లు తెలిపారు. డెంగీ కేసులు 2022లో 2,174, 2023లో 3,252 నమోదు కాగా.. 2024 ఆగష్టు 25 నాటికి 2,955 నమోదైనట్లు పేర్కొన్నారు. ఇందుకు కారణం తాగునీరు కలుషితం కావడమన్నారు. అంతేకాక పారిశుధ్యం లోపించడం మరో కారణమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో బాలికలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేల్‌లో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. కర్నూల్ జిల్లా అప్సర మండలం నగరూరు గ్రామంలో అశ్విని అనే విద్యార్థిని సన్నీ అనే యువకుడు పురుగుల మందు తాగించడంతో ఆమె కూడా మృతి చెందిందన్నారు. కడపలో టిడిపి నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి మీద కొందరు వ్యక్తులు కర్రలతో పట్టపగలు దాడి చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు, పారిశుధ్యం, ఆస్పత్రుల్లో కనీస సదుపాయాల మీద దృష్టి సారించాలని తులసిరెడ్డి కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- 300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. కడపకు చెందిన శ్రీ శివశంకర్ ఆసుపత్రి, కడప మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వేంపల్లె మండల శాఖకు చెందిన మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బిపి, షుగర్, ఉబ్బసం, క్యాన్సర్, రక్తహీనత, థైరాయిడ్, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు జనరల్ మెడిసిన్ వైద్యులు వంశీ విహారి, గైనకాలజిస్ట్ వైద్యులు సాయిచరిత్ర, ఆర్థోపెడిక్ వైద్యులు గద్దె శివ బాబు వైద్య పరీక్షలు చేసి సలహాలిచ్చారు. స్థానిక వైద్యులు ఆరుసేర్ల రంగయ్య, రాజారాం, అరుణ్, ఫిజియోథెరపీ యోగేశ్వర బాబు, నిర్మల ల్యాబ్ నిర్వాహకులు శేఖర్ బిపి, షుగర్ వైద్య పరీక్షలకు తోడ్పాటునిచ్చారు. రోగులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చక్రపాణిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానవత వ్యవస్థాపకులు ఎన్.రవిచంద్రరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రాటాల గోపి, కడప డైరెక్టర్ బోర్డు సభ్యులు శివశంకర్‌రెడ్డి, కో-చైర్మన్ కావలి కృష్ణతేజ, మండల శాఖ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, డైరెక్టర్ బోర్డు సభ్యులు రామమునిరెడ్డి, చల్లా బాలాజీ, ఓబుల్‌రెడ్డి, కావలి ముత్యాలయ్య, రామ మనోహర్‌రెడ్డి, శ్రీకళ, ఆలమూరు శివ, మదర్ థెరీస్సా ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, గోపి, దివాకర్, చలపతి, వెంకటసుబ్బయ్య, చైతన్య స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు